

మద్యం వల్ల యువకుని మృతి బాధాకరం

బెల్టుషాపులను అరికట్టాలి: సిపిఎం

జీలుగుమిల్లి :మండలంలోని పి.రాజవరం గ్రామంలో మద్యానికి బానిసై కాకాని వంశీ (24) మృతి చెందడం బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ఓ ప్రకటనలో తెలిపారు. బెల్ట్ షాపులు లేకుండా చూస్తామన్న కూటమి ప్రభుత్వం మండలంలో పంచాయతీకీ మూడు బెల్ట్‌షాపుల చొప్పున పెట్టి పెద్ద వ్యాపారమే చేస్తుందని విమర్శించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తుండటంతో యువత మద్యానికి బానిసై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని విమర్శించారు. చిన్న వయసులో మద్యానికి బానిసై మృతి చెందిన వంశీ కుటుంబాన్నీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మండలవ్యాప్తంగా ఉన్న బెల్ట్ దుకాణాలను తొలగించాలని, లేనిపక్షంలో ఆయా గ్రామాల్లోని మహిళలతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'చింతలపూడి' పూర్తి చేస్తాం

- చెరువులకు నీళ్లిచ్చేలా చర్యలు
- అవుటర్ రింగ్ రోడ్డుతో అభివృద్ధి ముందుకు
- మామిడి రైతులకు అండగా ఉంటాం
- ఆగిరిపల్లిలో 206 పేద కుటుంబాలకు మార్గదర్శకుల సాయం
- పి-4 ప్రజావేదికలో సిఎం చంద్రబాబు
- యాదవ, నాయీ బ్రాహ్మణ కుటుంబాల ఇంటికి వెళ్లి సమస్యలు అడిగిన సిఎం
- గత వైసిపి సర్కార్ కంటే ఘోరంగా మీడియాపై ఆంక్షలు



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు


ట్రాక్టర్ నడుపుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఆగిరిపల్లి

చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా, 2019లో టిడిపి ప్రభుత్వం రాకపోవడంతో పూర్తి కాలేదని, ఇప్పుడు సమస్య కోర్టులో ఉందని, సమస్యను పరిష్కరించి 'చింతలపూడి'ని పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటామని సిఎం చంద్రబాబు తెలిపారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మార్కెట్ యార్డ్‌లో పి-4 ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిఎం చంద్రబాబు ఉదయం 10.45 గంటలకు వడ్లమానులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. సిఎంకు మంత్రులు కొలుసు పార్థసారధి, సవిత, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, మేయర్ నూర్జహాన్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్చాలు ఇచ్చి సిఎంకు ఘనస్వాగతం పలికారు. ముందుగా యాదవ సామాజిక తరగతికి చెందిన నక్కబోయిన కోటయ్య ఇంటికి వెళ్లిన సిఎం వారి పశువుల పాకను పరిశీలించి గేదెలు, మేకల పెంపకం ద్వారా ఆదాయం ఏవిధంగా పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. తర్వాత నాయీబ్రాహ్మణులకు చెందిన బత్తుల జగన్నాథం క్షౌరశాలను సిఎం పరిశీలించారు. జగన్నాథంతో మాట్లాడి వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. అత్యాధునిక పనిముట్లతో కూడిన కిట్‌ను సిఎం బహూకరించారు. అనంతరం మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు సిఎం చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, సభా వేదికకు చేరుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 99 వేల బంగారు కుటుంబాలు ఉండగా ఆగిరిపల్లిలో 206 కుటుంబాలు ఉన్నాయన్నారు.

మెట్ట ప్రాంత అభివృద్ధికి సహకరించండి
మంత్రి పార్ధసారథి, ఎంపీ పుట్టా మహేష్

జిల్లాలో నూజివీడు మెట్ట ప్రాంతమని, అభివృద్ధిలో వెనుకబడి ఉందని, సాయం చేయాలని మంత్రి పార్థసారథి సిఎంను కోరారు. మెట్ట ప్రాంత భూములను సస్యశ్యామలం చేసేందుకు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి లిఫ్టులు ఏర్పాటు చేస్తే సద్గురు, కొమ్మూరు, మీర్జాపురం చెరువులకు నీళ్లందుతాయని, దాదాపు 25 వేల ఎకరాలు సాగవుతుందని తెలిపారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయడంతోపాటు ఏలూరులో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. భూముల ధరలు ఎక్కువగా ఉండటంతో పరిశ్రమల ఏర్పాటులో ఇబ్బంది ఉందని తెలిపారు. ఆగిరిపల్లి సచివాలయం-2 కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలోని జనాభా, అక్కడ స్థితిగతులను సిఎంకు వివరించారు. అగిరిపల్లిలో తలసరి కుటుంబ ఆదాయం రూ.2,06,403గా ఉందని తెలిపారు.

గంటా 25 నిముషాలు సిఎం ప్రసంగం


మాట్లాడుతున్న మంత్రి పార్ధసారథి, ఎంపీ మహేష్‌కుమార్



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న సిఎం, మంత్రులు

పి-4 కార్యక్రమంలో భాగంగా సిఎం చంద్రబాబు దాదాపు ఒంటి గంటకు ప్రారంభించి 2.25 గంటల వరకూ దాదాపు గంటా 25 నిముషాలు ప్రసంగించారు. బిసిలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, ఇళ్ల నిర్మాణాలతోపాటు అనేక అంశాలను ప్రస్తావించారు. ఆగిరిపల్లిలో 55 కుటుంబాలకు ఇంటి స్థలం లేదని, భూమి సేకరించి ఇళ్లు కట్టిస్తామని కలెక్టర్‌కు ఆదేశాలిస్తున్నట్లు తెలిపారు. 31 ఇళ్లలో మరుగుదొడ్లు లేవని, ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి సిఎం అధికారులకు తెలిపారు. 30 కుటుంబాలకు కుళాయి లేదని ఏర్పాటు చేయాలన్నారు. కరెంటు ఉన్నవారంతా సోలార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 12 కిలోమీటర్ల సీసీ రోడ్లను మూడేళ్లలో పూర్తి చేస్తామని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ 20 కిలోమీటర్లు పూర్తి చేస్తామని, వీధిలైట్లు లేనిచోట్ల ఏర్పాటు చేస్తామని సిఎం తెలిపారు. పి-4 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 206 కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన ప్యారీ రేష్మ, బోనం లక్ష్మిదుర్గతో సిఎం మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోనం లక్ష్మి దుర్గకు భర్త చనిపోయి రెండేళ్లయినా పింఛన్ రాలేదని చెప్పడంతో వచ్చే నెల నుంచే పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను సిఎం ఆదేశించారు. మార్గదర్శకులుగా ముందుకొచ్చిన నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకర్, కుశలవ గ్రూప్ సిద్ధార్థ, హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత గౌతమ్, నితిన్ సాయి కనస్ట్రక్షన్ నితిన్ కృష్ణ, మోడల్ డెయిరీ ఛైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కాలేజీ ఛైర్మన్ రావి వెంకట్రావు మాట్లాడుతూ పేద కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మార్గదర్శకులకు సిఎం శాలువా కప్పి సత్కరించారు.

గ్రూపు రాజకీయాలపై చంద్రబాబు సీరియస్

ఆగిరిపల్లిలో పి-4 కార్యక్రమం ముగిసిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలతో సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి మీడియాను అనుమతించలేదు. అంతర్గత సమాచారం ప్రకారం నూజివీడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల గ్రూప్ రాజకీయాలపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలిసింది. మంత్రి కొలుసు పార్ధసారధి గ్రూప్, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గ్రూపుల మధ్య ముదురుతున్న విబేధాలపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. గ్రూప్ రాజకీయాలకు స్వస్తి పలకకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో దిగజారుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని తెలుగు తమ్ముళ్లను హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ విధానాలను ప్రజలు మెచ్చేవిధంగా ప్రతిఒక్క నాయకుడు కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది.

గత వైసిపి సర్కార్ కంటే ఘోరంగా మీడియాపై ఆంక్షలు


గత వైసిపి ప్రభుత్వంలో సిఎం పర్యటనలో మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించేవారు. ప్రింట్ మీడియా ఫొటోగ్రాఫర్లు, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌లకు మీడియా పాస్‌లు ఇచ్చేవారు కాదు. రిపోర్టులను సైతం తీసుకెళ్లి ఒకచోట కూర్చోపెట్టి, మళ్లీ తీసుకొచ్చేవారు. దీంతో గత ప్రభుత్వ తీరును జర్నలిస్టులు తీవ్రంగా వ్యతిరేకించినా పరిస్థితి కొనసాగింది. తాము అధికారంలోకి వస్తే మీడియాకు స్వేచ్ఛ కల్పిస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పదినెలలు గడిచిపోయింది. జర్నలిస్టులపై ఆంక్షలు మాత్రం తొలగలేదు. సిఎం పోలవరం పర్యటనకు వచ్చినా ఇవే ఆంక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆగిరిపల్లి మండలంలో పి-4 కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రింట్ మీడియా ఫొటోగ్రాఫర్లకు, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌లకు మీడియా పాస్‌లు ఇవ్వలేదు. హెలీప్యాడ్ వద్దకు ఏఒక్కరినీ రానివ్వలేదు. సిఎం బిసి కుటుంబాలను కలిసినా అక్కడికి మీడియాకు అవకాశం ఇవ్వలేదు. ప్రభుత్వం నియమించిన పిఆర్‌ఒలు ఏ ఫోటో ఇస్తే అదే పెట్టుకోవాలని, ఏది రాసిస్తే అదే ప్రచురించాలనే రీతిలో వ్యవహారం సాగుతోంది. కావాలని కొందరు అధికారులే ఈ విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఈ విధానం లేదు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాల్సిందే

- ఏలూరులో ముస్లింల భారీ ర్యాలీ
- మద్దతు పలికిన సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వైసిపి నేతలు
- మన రాష్ట్రంలో ఇబ్బంది ఉండదు : ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అమలులోకి తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లిం సంఘాల జెఎసి ఆధ్వర్యాన ఏలూరులో శుక్రవారం మధ్యాహ్నం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని జెఎసి అధ్యక్షులు ఇలియాజ్ స్పష్టం చేశారు. తొలుత ఏలూరు పాత బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకూ నగర ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా చట్ట సవరణలు చేస్తూ దుందుడుకుగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వమే మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ ఆందోళనకు మద్దతు పలికిన ఏలూరు టిడిపి ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఈ చట్టం వల్ల మన రాష్ట్రంలో ముస్లింలకు ఎటువంటి నష్టమూ కలగకుండా తమ ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చారు. ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు ఎమ్‌డి. ఇలియాజ్ మాట్లాడుతూ వక్ఫ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసేలా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ర్యాలీలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, వైసిపి నేతలు ఎం.జయప్రకాష్, గుడిదేశి శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, నేత వివిఎన్.ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర నేత బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

జిపిఎస్ ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - దెందులూరు

జిపిఎస్ ఆన్‌లైన్ సమస్యలు వెంటనే పరిష్కరించి మిల్లుల వద్దకు ట్రాక్టర్ల మీద రైతులు, కౌలు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు అంటూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో పోతునూరులో శుక్రవారం రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని నినదించారు. జిపిఎస్ ఆన్‌లైన్ సమస్యతో అన్ని మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు అన్‌లోడ్ కాకుండా నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిపిఎస్ సాంకేతిక సమస్య వల్ల మిల్లుల వద్దకు తీసుకొచ్చిన ధాన్యం అన్‌లోడ్ చేయకపోవడం వల్ల అకాల వర్షం కురవడంతో రైతులు, కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు పని చేయకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మరోవైపు అకాల వర్షాల వల్ల కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. తేమశాతం నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల అధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, చల్లా బాలస్వామి, బుర్ల సత్యనారాయణ, జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు, కౌలు రైతులు, రైతు సంఘం నేతలు

గ్యాస్, పెట్రోలు ధరలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - కుక్కునూరు

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సెంటర్‌లో గ్యాస్ సిలిండర్‌తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ 2014 నుండి నేటి వరకు మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు భిన్నంగా అన్ని రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. తక్షణం పెంచిన ధరలు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంగాల కల్లయ్య, మున్ని, సోడే చిరమయ్య, ఎం.రమేష్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నేతలు

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టిజి.భరత్ అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో అమర్‌నాధ్ రైస్ ఇండస్ట్రీస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రైస్ ఇండస్ట్రీస్‌ను పరిశీలించారు. యజమానులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టే పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ పరిశ్రమను భవిష్యత్తులో విస్తరించేందుకు యాజమాన్యం ఆలోచన చేస్తోందన్నారు. దీంతో దాదాపు 600 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని నిర్వాహకులు చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అమరనాధ్ రైస్ ఇండస్ట్రీస్ యజమానులు కోనా శ్రీనివాసరావు, కోనా హనుమాన్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రైస్ మిల్లును ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలివ్వాలి

వ్యకాస

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం బృందం ఉపాధి హామీ పనులు జరుగుతున్న దేవపూడి, ఊటుకూరు, నారాయణపురం, వి.రావిగుంట గ్రామాల్లో పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ దేవపూడిలో ఐదు గ్రూపులకు, ఊటుకూరులో మూడు గ్రూపులకు పని కావాలని అడిగారన్నారు. ఊటుకూరులో పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దేవపూడి గ్రామంలో కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. నారాయణపురంలో పని చేసిన కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ సదుపాయాలు కల్పించాలని కోరారు. వి.రావిగుంట, దేవపూడి, ఊటుకూరు కూలీలకు పనికి తగ్గ డబ్బులు రావట్లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.300 వేతనం ఇస్తామని చెబుతుంటే కనీసం రూ.250 కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. గతంలో చెరువులో చేసిన పనికి నేటికీ డబ్బులు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఊటుకూరు గ్రామంలో జరిగిన అవినీతిని వెలికితీయాలని డిమాండ్ చేశారు. జాబ్‌కార్డుల పేరుతో పేదల దగ్గర డబ్బులు వసూలు చేసి నేటికీ కొంతమందికి జాబ్‌కార్డు ఇవ్వకుండా మోసగించారని మండిపడ్డారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఎటువంటి సౌకర్యాలూ లేవని, టెంట్లు, తాగునీరు, మందుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త జాబ్‌కార్డులు వెంటనే అర్హులైన వారందరికీ ఇవ్వాలని కోరారు.


ఉపాధి కూలీలకు కరపత్రం పంపిణీ చేస్తున్న నేతలు

పెళ్లికారును ఢీకొన్న కంకర లారీ

- పెళ్లికొడుకుతో సహా ఆరుగురికి గాయాలు
- వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులు

ఉంగుటూరు :శుక్రవారం రాత్రి 9.04 గంటలకు ఏలూరులో పెళ్లి. పాలకొల్లు నుంచి పెళ్లికొడుకు కుటుంబ సభ్యులతో కారులో బయల్దేరారు. ఆ కారు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఉంగుటూరు మండలం నాచుగుంట వద్దకు వచ్చేసరికి ప్రమాదానికి గురైంది. హైవే సిబ్బంది క్షతగాత్రులందరినీ ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. పెళ్లికొడుకుకు స్వల్ప గాయాలు కావడం, అతని కుటుంబ సభ్యుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో పెళ్లివారి ఇంట ఉత్కంఠ నెలకొంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లు నుంచి ఏలూరు వైపు వెళ్లే పెళ్లి కారు ఉంగుటూరు మండలం నాచుగుంట వద్దకు వచ్చేసరికి ఉంగుటూరు ఊళ్లోంచి కాల్వగట్టు మీదుగా ప్రయాణించి నాచుగుంట వద్ద జాతీయ రహదారిపైకి ఆకస్మికంగా వచ్చి ఏలూరు వైపు వెళ్తున్న కారును ఢీకొంది. పైగా కొంతదూరం కారును ఈడ్చుకుపోయింది. కారులో ఎడమవైపు బెలూన్ ఓపెన్ అయింది. ప్రమాదం జరిగిన సమయంలో కారును పెళ్లికొడుకే నడుపుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో జి.పద్మావతి, కె.నాగేశ్వరరావు, జి.నాగమణి తీవ్ర గాయాలవ్వగా పెళ్లి కొడుకు జి.నవీన్, జి.ప్రవీణ్‌కుమార్, పి.రాజేంద్రప్రసాద్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. నలుగురిని హైవే అంబులెన్సులో, ఇద్దరిని హైవే పోలీసు వాహనంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. చేబ్రోలు పోలీసులు, హైవే సిబ్బంది ప్రమాదం జరిగిన క్షణంలోనే క్షతగాత్రులను కారుల్లోంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించడంలో వేగంగా స్పందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ వెల్లడించారు. ఒకపక్క పెళ్లి ముహూర్తం సమీపించడం, మరోపక్క పెళ్లి కొడుకు కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలతో ఇరువైపులా విషాదం నెలకొంది.

పేరుకే స్వచ్ఛందం.. అంతా నిర్బంధమే

తాజాగా పాఠశాలల కేటగిరీల మార్పుపై తీర్మానాలు ఇవ్వాలని ఆదేశాలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వాల నిర్ణయాలతో కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానం ప్రయోగశాలగా మారిపోయింది. జాతీయ విద్యా విధానం 2020 కేంద్రం సూచించినప్పటికీ ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మరే ఇతర రాష్ట్రంలోనూ అమల్లోకి రాలేదు. గత ప్రభుత్వం జిఒ నెం.117తో ప్రారంభమైన నూతన విద్యా విధానం. దాని రద్దు పేరుతో మరింత తీవ్ర సంక్షోభంలోకి ప్రభుత్వ పాఠశాలలను తీసుకెళున్నారని విద్యారంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్

పాఠశాలల కేటగిరి మార్పుపై మొదట ఎస్‌ఎంసి అభిప్రాయాలు, తీర్మానాలు తప్పనిసరి అని రాష్ట్ర అధికారులు తెలిపారు . అందులో భాగంగా మెజారిటీ పాఠశాలల ఎస్‌ఎంసిలు తరగతుల తరలింపు, ప్రాథమికోన్నత పాఠశాలల కుదింపుపై వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశాయి. దీంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసి ఛైర్మన్లను కొందరిని కలెక్టర్ వద్దకు పిలిచి ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా నూతన పాఠశాలల విధానం గురించి పూర్తిస్థాయిలో చెప్పించి ఒప్పించే ప్రయత్నం చేశారు. ఎస్‌ఎంసిలది అభిప్రాయం చెప్పడం వరకే తప్ప నిర్ణయం ప్రభుత్వానిదే అన్నట్లు వ్యవహరించారు. దీంతో ఇంతదూరం తమను ఎందుకు రప్పించడం అంటూ ఎస్‌ఎంసి ఛైర్మన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తాజా ఆదేశాలతో హెచ్‌ఎంల తంటాలు

తాజాగా విద్యాశాఖ శుక్రవారం సాయంత్రంలోపు ఎస్‌ఎంసి అంగీకార పత్రాన్ని తీసుకుని ఎంఇఒ లాగిన్ నుండి అప్‌లోడ్ చేయాలని తెలపడంతో హెచ్‌ఎంలు తలలు పట్టుకుంటున్నారు. ఒకపక్క యుపి పాఠశాలల్లో తరగతుల కుదింపు, ఎఫ్‌పి పాఠశాలలుగా అనేక పాఠశాలల్లో తరగతుల తరలింపుపై గతంలోనే వ్యతిరేకంగా తీర్మానం చేయగా మళ్లీ ఎస్‌ఎంసి అంగీకార తీర్మానపత్రం ఇవ్వాలని తెలపడంతో ఏ విధంగా ఎస్‌ఎంసి సభ్యులకు నచ్చజెప్పాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ముందుచూస్తే గొయ్యి, వెనక చూస్తే నుయ్యి ఎలా ఉందని హెచ్‌ఎంలు వాపోతున్నారు. స్వచ్ఛందం నుండి నిర్బంధంగా అంగీకార పత్రాలు ఇవ్వాలని ఆదేశాలతో పని చేయాలో, లేదో తెలియడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గురువారం ఒక్క రోజే మూడు రకాల తీర్మానాలు మార్చి మార్చి చివరకు అధికారులు తీసుకున్న నిర్ణయానికి అనుకూలంగా ఉన్నటు వంటి తీర్మానాన్ని అందించి కేవలం హెచ్‌ఎం, ఎస్‌ఎంసి ఛైర్మన్ సంతకాలతో ఉదయం 11 గంటల్లోపు కాపీలు అందించాలని ఒత్తిడి తీసుకొచ్చారంటే పరిస్థితి ఎంత స్వచ్ఛందమో అర్థమవుతోందని సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కొంత మంది ఎంఇఒలు పైనుంచి ఒత్తిడి ఫలితంగా ప్రధానోపాధ్యాయులపై బెదిరింపు ధోరణితో మాట్లాడారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.


మోడల్ పాఠశాలల పేరుతో తరలింపు

తరగతికి ఒక టీచర్ అనే పేరుతో మండలానికి ఎనిమిది నుండి 15 వరకు మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు. మొదట్లో 60 మందికిపైగా విద్యార్థులు ఉంటే ఐదుగురు టీచర్లను కేటాయిస్తూ ఎంపిఎస్‌లను ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో అనేక పంచాయతీల్లో తరగతుల తరలింపు జరిగింది. అయినప్పటికీ 60 మంది విద్యార్థులు లేకపోవడంతో ప్రస్తుతం 45 మంది విద్యార్థులు ఉన్న ఎంపిఎస్ (మోడల్ ప్రైమరీ స్కూల్)గా పరిగణిస్తూ ఈ పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తున్నారు. అయితే అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. అంతేకాకుండా బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 30 నుండి 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు అనేకం ఉన్నాయి. అయితే వాటిలో మాత్రం కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. 45 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులను ఇచ్చినప్పుడు 30 నుండి 40 మంది విద్యార్థులు ఉన్నచోట కూడా మూడో ఉపాధ్యాయుడిని నియమించాలని సంఘాలు కోరుతున్నాయి. ఏదేమైనా మోడల్ పాఠశాలల్లో ప్రస్తుతం కన్పిస్తున్న విద్యార్థుల సంఖ్య పాఠశాలల ప్రారంభం నాటికి ఉంటుందో, లేదోనని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



చేతులెత్తేసిన ఎంఎల్‌ఎలు

తరగతుల తరలింపు, యుపి పాఠశాలల కుదింపుపై ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు ఎంఎల్‌ఎలను ఆశ్రయించినప్పటికీ ఇది ప్రభుత్వ నిర్ణయమని, తామేమీ చేయలేమని చెబుతుండటం గమనార్హం. ఏదేమైనా జిఒ నెం.117 రద్దు డిమాండ్ అమలు చేసినా, దాన్నే మరో రూపంలో మరింత ప్రమాదకరమైన విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, దీంతో ఇక గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారధి

నూజివీడు ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు కృషి


రాష్ట్ర మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రి అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి హామీ ఇచ్చారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో వెలగపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.13 లక్షల విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్ వితరణగా అందించారు. ఈ మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను మంత్రి పార్థసారధి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది దగ్గర డబ్బు ఉంటుందని, ప్రజల అవసరార్థం సేవాభావంతో వినియోగించే వ్యక్తులు అరుదుగా ఉంటారని చెప్పారు. అలాంటి వారిలో వెలగపూడి ట్రస్ట్ ఛైర్మన్ వెలగపూడి రాజకుమార్ మొదటి వరుసలో ఉంటారని, వారి సేవకు ప్రభుత్వం తరపున, ప్రజల తరపున కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఆగిరిపల్లిలో పి4 పేరిట పేదరికాన్ని తరిమికొట్టే కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. అలాంటి సందర్భంలో గొప్ప వితరణ కార్యక్రమం ప్రారంభించుకోగలగడం ఎంతో అదృష్టమన్నారు. గతంలోనూ రాజకుమార్ అనేక ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేసినట్లు వివరించారు. ఆసుపత్రి పురోభివృద్ధి, పేదల ఆరోగ్యం కోసం ఎన్ని రకాల సేవలైనా అందిస్తానని స్వచ్ఛందంగా చెబుతున్న వెలగపూడి రాజకుమార్ నేటి యువతరానికి ఆదర్శనీయులన్నారు. ప్రస్తుతం నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నూతన భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రజల అభీష్టం మేరకు ఈ ఆసుపత్రి అభివృద్ధి పథంలో పయనించేందుకు అప్ గ్రేడ్ చేయాలని సిఎం చంద్రబాబుకు విన్నవించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో పేదల ఆరోగ్యం కోసం అవసరమైన రూ.30 లక్షల విలువైన సిటీ స్కాన్, ఇతర పరికరాలు త్వరలోనే ఆసుపత్రికి ప్రభుత్వం తరపున అందించనున్నట్లు మంత్రి పార్థసారధి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ఆసుపత్రి వైద్య ఆరోగ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


బంక్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

మండలంలోని అరిపాటిదిబ్బలు వద్ద నూతనంగా నిర్మించిన సొసైటీ పెట్రోల్ బంక్‌ను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ పెట్రోల్ బంక్ స్థానికులకు సౌకర్యవంతమైన సేవలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవి, జిల్లా జోనల్ కమిటీ సభ్యుడు చోడిపిండి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి మొద్దు తేజ, మండల ప్రెసిడెంట్ తోట రవి, టౌన్ ప్రెసిడెంట్ మాదేపల్లి శ్రీను, ఎఎంసి మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, టిడిపి ఆర్గనైజర్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి, కొయ్యలగూడెం బ్రాంచ్ డిసిసిబి మేనేజర్ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామానుజపురంలో డ్రై డే

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని రామానుజపురంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యనగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు వ్యాపిస్తాయని, మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి బి.యువరాజు, ఎఎన్ఎం బి.సోమలమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్‌కె.మహబూబ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నేత తల్లికి పరామర్శ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జనసేన కొయ్యలగూడెం మండల ప్రధాన కార్యదర్శి ఏపూరి సతీష్ తల్లి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఆమె గుండె శస్త్రచికిత్స చేయించుకోనున్న విషయం తెలుసుకున్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శుక్రవారం ఆమెను కలిసి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు జనసేన జిల్లా కార్యదర్శి గడ్డ మనుగు రవి, మండల ప్రెసిడెంట్ తోట రవి, టౌన్ ప్రెసిడెంట్ మాదేపల్లి శ్రీను, నాయకులు దుగ్గిన శ్రీను, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య పరికరాలు అందిస్తున్న దాతలు

ప్రభుత్వాసుపత్రికి వైద్య పరికరాలు అందజేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

జంగారెడ్డిగూడెం నవభారత్ ఫౌండేషన్ ఎస్ చౌదరి ద్వారా ప్రభుత్వాసుపత్రికి 68 రకాల వైద్య పరికరాలు అందించారని మండల వైద్యాధికారి జి.ఫణీంద్ర తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజారోగ్య, సంక్షేమం నిమిత్తం 68 రకాల అమూల్యమైన వైద్య పరికరాలు, ఆసుపత్రి సామగ్రి అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఫణీంద్రబాబు మాట్లాడుతూ ఆసుపత్రికి పరికరాలు అందించడం అభినందనీయమని, అందుకు సహకారం అందించిన నవభారత్ కంపెనీ, ఫౌండేషన్ నిర్వాహకులు ఎఎస్.చౌదరికి సంస్థ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎం.సునంద, గ్రామానికి చెందిన పెద్దలు కాసగాని వెంకట్రావు, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై గ్రామసభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని జైనవారిగూడెంలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు కార్యక్రమంపై స్థానిక రైతు సేవా కేంద్రంలో సర్పంచి తాటి సీత అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పివి.చలపతిరావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో బుట్టాయగూడెం మండల పరిధిలో 34 ఎకరాల వరి సాగు నమోదైందని, రైతులు పండించిన ధాన్యం దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తుందని తెలిపారు. రైతులందరూ కూడా ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు మాట్లాడుతూ మండల పరిధిలో నూతి రామన్నపాలెం, లక్ష్ముడుగూడెం, మర్లగూడెం గ్రామాల్లో ఈ రబీ సీజన్‌లో వరి సాగు చేసినట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. అటవీ భూములు, డీ-నమున పట్టాలు భూములు కలిగిన రైతులు కూడా తప్పనిసరిగా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు సేవా కేంద్రం సహాయకులు ఎం.సురేష్, ధాన్యం కొనుగోలు కేంద్రం సూపర్‌వైజర్ కె.సాయిబాబు, సివిల్ సప్లైస్ ఆర్ఐ పద్మావతి, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు జ్యోతిరావుపూలే


అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి
ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తన జీవితాన్ని భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో పోరాటం, ప్రతిఘటన, సంస్కరణకు అంకితం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి కొనియాడారు. జ్యోతిరావుపూలే 198వ జయంతి వేడుకలను ఏలూరు జ్యూట్‌మిల్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అక్కడ ఉన్న జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, డివిజన్ ఇన్‌ఛార్జి కప్పా ఉమామహేశ్వరరావు, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, చోడే బాలు, వీరంకి త్రినాథ్ పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో.. సిపిఎం ఆధ్వర్యాన జయంతి వేడుకలు


చింతలపూడి : అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీలో మేడబడి వద్ద శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటియఫ్, బిసి ఉద్యోగ, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు మధుబాబు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.


చింతలపూడిలో..

జంగారెడ్డిగూడెం : సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న పూలే విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబు, పట్టణ నాయకులు వి.గోపి, యు.సత్యనారాయణ, ఎం.ప్రసాద్, డి.ఆశీర్వాదం, స్టాలిన్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు ప్రధానోపాధ్యాయురాలు కెవిఎస్‌వి. లోకకుమారి పుష్ప మాలాలంకృతని చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన తరగతుల ముఖ్యంగా మహిళలు నేడు ఉద్యోగాలు చేసుకుంటూ సమాజంలో గౌరవంగా, ఉన్నతంగా బతుకుతున్నారంటే దానికి కారణం మహాత్మా జ్యోతిరావు పూలే అసమాన పోరాటం, అపరిమిత త్యాగనిరతి అని అన్నారు. ఒక మహిళ విద్య నేర్చుకుంటే ఇంటిల్లిపాదికి విద్య నేర్పినట్లే అని ఆయన బాలికల అక్షరాభివద్ధికి ఎంతో తోడ్పడ్డారని కొనియాడారు. తెలుగు ఉపాధ్యాయులు గుమ్మళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయన కులరహిత సమాజం కోసం ఎన్నో వ్యాసాలు రాశారని సత్యశోధక్ సమాజ్ అని ఒక ఆర్గనైజేషన్ ద్వారా పోరాటాలు చేసి సమాజంలోని పేద, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సెక్రటరీ టి.జగదీష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శాంతరాజు, గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారు గోరింక గాంధీ, కొండపల్లి నాంచారయ్య, చేబోయిన వెంకటేశ్వరరావు, కట్టా వెంకటేశ్వరరావు, గోడపాటి యాకోబు, ఎం.ఫణి, పి.మరియదాసు, జవాదీ వెంకటేశ్వరరావు, గాజులపల్లి వెంకటేశ్వరరావు, శుభకరరావు, నల్గొండ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో...

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం-కన్నాపురం రోడ్డులోని గ్రంథాలయం వద్ద సర్పంచి ముప్పిడి విజయ కుమారి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు.


జంగారెడ్డిగూడెం జెడ్‌పి బాలుర హైస్కూల్‌లో...

ముసునూరు : దళిత, బహుజన, మహిళల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే కృషి చేశారని కాట్రేనిపాడు సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలో సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, కొండేటి బాబి, లక్కపాము కాంతారావు, మెదరమెట్ల సురేంద్ర, పులిబళ్ల సత్యనారాయణ, జ్యోజి, ఉప్పలపాటి గణేష్, కె.రాంబాబు, కె.దాసు, మందలపు ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎన్ఎస్‌-ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రాంజీ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నవీన్ లావణ్యలత, ఎన్ఎస్ఎస్ యూనిట్- 1, 2 అధికారులు డాక్టర్ షేక్ అన్వర్ భాషా, డాక్టర్ టి.నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

రైతు మనుగడ కోసం పోరాటం

ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రైతు సంఘం నేతలు


దెందులూరు మండలంలో..

ప్రజాశక్తి - దెందులూరు

రైతుల హక్కులను హరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయ విధానాలు అవలంభించడం వల్ల నేడు రైతు మనుగడ కోసం పోరాటం చేయాల్సి వస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోతునూరులో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. రైతు ఉద్యమ అమరవీరుడు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11న ఏర్పడిన అఖిలభారత కిసాన్ సభ దేశ స్వాతంత్ర్యం కోసం, జమీందారీ విధానం రద్దు కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. అనేకమంది చేసిన త్యాగాలు ఫలితంగా రైతులు హక్కులు సాధించుకున్నారని చెప్పారు. రైతుల హక్కులను హరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయ విధానాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతాంగం ఉద్యమం చేసిందని, ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేశారని చెప్పారు. రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మద్దతు ధరలు గ్యారంటీ చట్టం తీసుకురావాలని, రైతు రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, చల్లా బాలస్వామి, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నిడమర్రు :మండలంలోని అడవికొలను, భువనపల్లి గ్రామాల్లో రైతు సంఘం 90వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, తెలంగాణ, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో రైతులు పండించే పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నారన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లావేటి సోంబాబు, సిఐటియు నాయకులు నారపల్లి రమణారావు, వెలగలేటి మోహన్, గవర సత్యనారాయణ, కానూరు రాజు, కమిలి నాని, గిద్ద నాగేశ్వరరావు, పిల్లా రాంబాబు, కె.అప్పారావు, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని రైతు సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత కిసాన్ (ఎఐకెఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీలుగుమిల్లి రైతు సంఘం స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం రైతు దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం నాయకులు తాళ్లూరి సూర్యారావు, సుంకవల్లి శేషగిరిరావు, యలమటి నరసింహారావు, దాసరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంతి

కొయ్యలగూడెం :ఈ నెల 14వ తేదీన మండల పరిషత్ కార్యాలయం వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఆరోజు ఉదయం 8:30 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి పూలమాల వేసి నివాళులర్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.


ఉపాధ్యాయుడు శ్యామ్‌ప్రసాద్‌కు అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డు


శ్యామ్‌ప్రసాద్

మండవల్లి :ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కూరేళ్ల శ్యామ్‌ప్రసాద్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డుకు ఎందుకయ్యారని ప్రయివేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పి.నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా కానుకొల్లు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మాధవ్‌కుమార్ సర్పంచి నాగదాసు థామస్ శుక్రవారం ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా అందిస్తున్న సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు ఎనలేనివని అని అన్నారు. ఆయన మరిన్ని సేవలు అందించి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

పోలవరం ప్రాజెక్టు సందర్శన

ప్రజాశక్తి - పోలవరం


మ్యాప్ పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్లు

పోలవరం ప్రాజక్టును కేంద్ర జల సంఘం డిప్యూటీ డైరెక్టర్లు మయాంక్ చేతన్, ఉత్కర్ష్ శుక్రాలు శుక్రవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలవరం చేరుకున్న ఈ బృందం తొలుత పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రాజెక్టు నిర్మాణంలో డయా ఫ్రంవాల్, బట్రస్ డ్యాం నిర్మాణ పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజక్టులో గ్యాప్ 1, 2 ప్రాంతాలను పరిశీలించారు. డయాఫ్రంవాల్ కాంక్రీట్ పనులు, ఎగువ కాపర్ డ్యాం వద్ద సీపేజీ నివారణ కోసం నిర్మిస్తున్న బట్రస్ డ్యాం పనులను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు సిబ్బంది వారికి పనుల వివరాలను మ్యాపు పాయింటింగ్ ద్వారా వివరించారు.

పశు బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

టి.నరసాపురం :రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పశుబీమా పథకాన్ని నాటు, మేలుజాతి పశువులు కలిగిన రైతులు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి కె.కోటేశ్వరరావు తెలిపారు. పశు బీమా పథకం ద్వారా ప్రభుత్వం రాయితీతో బీమా కంపెనీ వారికి ప్రీమియం చెల్లించి, పాడిపశువులకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ పథకంలో ఒక కుటుంబానికి పది పశువులకు బీమా చేయించుకోవచ్చని తెలిపారు. ఆవులు, గేదెలు, ఎద్దులు నాటు పశువులకు రూ.15 వేలు, మేలుజాతి పశువులకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు బీమా చేయించుకోవచ్చని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న రైతుల నాటు పశువులకు మూడేళ్లకు బీమా ప్రీమియం రూ.1960లో రైతు వాటాగా రూ.149 చెల్లిస్తే ప్రభుత్వం రూ.816 రాయితీ కల్పిస్తుందని, పశువుకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.15 వేలు బీమా నగదు వస్తుందని తెలిపారు. మేలుజాతి పశువులకు రూ.30 వేల నుంచి రూ.లక్షకు ఒక్కో పశువుకు బీమా చేసుకుంటే మొత్తం ప్రీమియం రూ.6,400 ఉండగా రైతు వాటాగా రూ.497 చెల్లించాలని, ప్రభుత్వం రూ.1,632 రాయితీ ఇస్తుందని తెలిపారు. దారిద్ర్య రేఖకు ఎగువ ఉన్న పాడి రైతులు 50 శాతం రూ.960 చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు మీ పరిధిలో ఉన్న రైతుసేవా కేంద్రంలోని పశుసంవర్ధక సహాయకుల ద్వారా రైతు వివరాలు, పశువు పూర్తి వివరాలు నమోదు చేయించుకుని రైతు వాటా బీమా సొమ్మును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. వ్యాధుల వలన పశువు చనిపోయినట్లయితే ఈ బీమా పథకం వర్తిస్తుందన్నారు. పశువు మరణించిన విషయాన్ని 24 గంటల లోపు పశుసంవర్ధక సహాయకులకు తెలియజేయాలని, పశువు చనిపోయిన 15 రోజులలోపు బీమా సొమ్ము రైతు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.